

ఆకలి ఆరాటం

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆకలి బాధలు ఇంకా తీరలేదు. సర్వం వరదపాలు కావడంతో ప్రభుత్వం అందించే భోజన ప్యాకెట్లు.. దాతలు పిడుతున్న ఆహారం కోసమే చాలామంది బాధితులు ఎదురుచూస్తున్నారు. పాయకాపురంలో మంగళవారం జరిగిన ఆహార పంపిణీలో పట్టెడన్నాన్ని ప్లేట్‌లో చూసి చిన్నారులు ఇలా ఆనంద పడిపోయారు.



వరద.. బురద.. : పాయకాపురంలో పరిస్థితి ఇదీ..




కష్టాల కన్నీరు : వరద అనంతరం ఇంటి పరిస్థితి చూసి రోదిస్తున్న మహిళ



మందులూ మిగల్లేదు : వైఎస్సార్ కాలనీలో ఓ మెడికల్ షాపు దుస్థితి



అయ్యో బియ్యం : వైఎస్సార్ కాలనీలో పాడైపోయిన రైస్



కన్నీరే మిగిలింది.. : వైఎస్సార్ కాలనీలో ఓ ఇంటి పరిస్థితి

వరద వేదన

- నరకయాతన అనుభవిస్తున్న వరద బాధితులు
- నామరూపాల్లేకుండా మారిన ఇళ్లు
- నాశనమైపోయిన వస్తువులు

కళ్లల్లో కడలంతా ఆవేదన.. గుండెల్లో కొండంత వేదన.. వరద చెర వీడినా చెదిరిపోయిన తమ బతుకులను తలచుకుంటూ ప్రశ్నార్థకంగానే ఇళ్లకు చేరుకుంటున్నారు వరద బాధితులు. నామరూపాల్లేకుండా పోయిన ఇళ్లను, నాశనమైపోయిన సామాన్లను చూసి నిశ్చేష్టులైపోతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులే నెలకొన్నా.. అసాధారణంగా మారిన పరిసరాలను చూసి కంటతడి పెట్టుకుంటున్నారు. అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, వైఎస్సార్ కాలనీ, కేఎల్‌రావు నగర్, కబేళా, విద్యాధరపురంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఎవరిని కదిలించినా కన్నీరు తప్ప మరొకటి రావట్లేదు. మొరాయించిన వాహనాలతో అష్టకష్టాలు పడుతున్నవారు కొందరైతే, పూర్తిగా పాడైపోయిన దుకాణాలు చూసి బోరుమంటున్న వారు ఇంకొందరు. అస్తవ్యస్తంగా మారిన ఇళ్లలో అడుగుపెట్టి ఆశ్చర్యపోతున్నవారు కొందరైతే, ఇంకా ముంపులోనే ఉన్న ఇళ్లకు ఎప్పుడు వెళ్తామా అని ఎదురుచూసేవారు ఇంకొందరు. టన్నులకొద్దీ పేరుకుపోయిన వ్యర్థాలు, వస్తువులను నిరాటంకంగా తొలగిస్తున్నది పారిశుధ్య కార్మికులైతే, బాధితులకు ఇంకా భోజన సదుపాయాలు కల్పిస్తూ బాసటగా నిలుస్తున్నారు దాతలు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



వీడని చెర : ఇంకా ముంపులోనే పాతపాడులోని మీనాక్షి నగర్



నాడు ఏరుగా సింగ్‌నగర్‌లోని డాబాకొట్లు సెంటర్



నేడు ఊరుగా సింగ్‌నగర్‌లోని డాబాకొట్లు సెంటర్



బతుకు బండలు.. : వైఎస్సార్ కాలనీలో పరిస్థితి

ఆపరేషన్ బుడమేరు

పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బీభత్సం సృష్టించిన బుడమేరుకు వరదలు తగ్గిపోవడంతో అధికారులు క్లీనింగ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. వరదకు కొట్టుకొచ్చిన చెత్తాచెదారాన్ని కాల్వ నుంచి తొలగించే పనులను వేగవంతం చేశారు. బుడమేరు నగరంలోకి ప్రవేశించే దగ్గర నుంచి నగరాన్ని వీడే వరకూ ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు 8,860 మెట్రిక్ టన్నుల చెత్తాచెదారాన్ని తొలగించగా, అందులో 1,000 మెట్రిక్ టన్నుల వరకు బుడమేరు వ్యర్థాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. బుడమేరు ప్రక్షాళన కోసం 30 ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేశారు. వీటిని తరలించేందుకు 50 నుంచి 60 టిప్పర్లను ఏర్పాటు చేశారు. ఈ ఆపరేషన్ మరో రెండు రోజులు కొనసాగే అవకాశముంది.

ఇన్సూరెన్స్.. ఇదిగో ఇక్కడ

సబ్ కలెక్టరేట్‌లో ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని సబ్ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు పెద్ద సంఖ్యలో వాహనదారులు, దుకాణదారులు, వ్యాపారులు వస్తున్నారు. మొత్తం 27 ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పనిచేస్తున్నాయి. ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ చేసుకునే వారికి ఇది ఉపయోగపడుతుంది. రెండు రోజులుగా క్లెయిమ్స్ చేసుకోవటానికి వస్తున్నారు కానీ, ఆశించిన స్థాయిలో మాత్రం రావట్లేదు. ఈ ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన సమాచారం ఇంకా చాలామందికి తెలియకపోవడమే ఇందుకు కారణం. దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముంది. ప్రస్తుతం వస్తున్న వారిలో ఆటోవాలాలు, మ్యాక్సీ క్యాబ్‌వాలాలు, ద్విచక్రవాహనదారులు, దుకాణదారులే ఉంటున్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు!

- పులిగడ్డ గురుకుల పాఠశాలలో 25మంది జ్వర పీడితులు

6లో..

నేటి నుంచి రైట్‌రైట్

- 70 ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణ
- వరదల కారణంగా వారంగా డిపోల్లోనే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం నుంచి ఆర్టీసీ సేవలు ప్రారంభం కానున్నాయి. వరదల కారణంగా 70 ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. వీటిలో చాలావరకు బుధవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఎంతమేర బస్సులు తిప్పగలమన్న అంశంపై మంగళవారం ఆర్టీసీ అధికారులు పరిశీలన జరిపారు. అయితే, ప్రధాన రహదారులకు పెద్దగా ఇబ్బంది లేకపోవడంతో కొన్ని బస్సులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. నున్న, నూజివీడు, విస్సన్నపేటకు వెళ్లే బస్సు సర్వీసులపై కొంత అనుమానాలు ఉన్నా.. వరద ఇబ్బంది లేకపోతే బస్సులు పంపిస్తామని అధికారులు తెలిపారు. వరదల కారణంగా వారం రోజులుగా సగానికి పైగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఇబ్రహీంపట్నం డిపో పరిధిలో 84 బస్సులకు 30 తిరిగేవి. విద్యాధరపురం డిపోలో 141 బస్సులకు 8 తిరిగేవి. ఈ డిపో మొత్తం నీట మునగడంతో 40 బస్సుల వరకూ దెబ్బతిన్నాయి. ఇక గవర్నర్ పేట-1 డిపో పరిధిలో 113 బస్సులకు 71, గవర్నర్ పేట-2 డిపో పరిధిలో 139 బస్సులకు 56 నడిచేవి. విజయవాడ, ఆటోనగర్ డిపోలకు సంబంధించి 80 శాతం బస్సులు తిరిగాయి. ప్రస్తుతం పరిస్థితులు చక్కబడుతున్న నేపథ్యంలో దాదాపు అన్ని బస్సులు పునరుద్ధరించాలని చూస్తున్నారు. ఇక వరద సహాయక చర్యల కోసం వివిధ శాఖలకు ఆర్టీసీ 60 బస్సుల వరకూ కేటాయించింది. వాటన్నింటినీ వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నారు.



తోట్లవల్లూరులో నాశనమైన కంద

ఎంత కష్టం.. ఎంత నష్టం



- అన్నదాతకు తీరని వేదన మిగిల్చిన వర్షాలు, వరదలు
- నాలుగు నెలల్లో అనావృష్టి, అతివృష్టితో అష్టకష్టాలు

కోటి ఆశలతో ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభించిన రైతన్నకు నాలుగు నెలల్లోనే అనావృష్టి, అతివృష్టి పరిస్థితులు కోలుకోలేని దెబ్బతీశాయి. జూన్, జూలై నెలలో నారుమడులను కాపాడుకున్న రైతులు, నాట్లు వేసిన అనంతరం ఆగస్టులో సాగునీరు లేక అల్లాడిపోయారు. ఇక ఆగస్టు చివరి రెండు రోజులు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, వరదలకు నిండా మునిగిపోయారు. వరి పొలాలు ఇంకా నీటమునిగే ఉన్నాయి. లంక భూముల్లోని ఉద్యాన పంటలు నాశనమైపోయాయి. ఆక్వా సాగు కూడా అక్కరకు రాకపోవడంతో అన్నదాతలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఏడాది 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. ఆగస్టు నెలాఖరు నాటికి 1.20 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. ఆగస్టు 29, 30, 31 తేదీల్లో కురిసిన భారీవర్షాలకు 25 మండలాల్లోని 410 గ్రామాల్లో 41,542 హెక్టార్లలో పంట పొలాలు నీటమునిగాయి. అలాగే, ఈనెల 1వ తేదీ నుంచి వరద పోటెత్తి గుడివాడ, నందివాడ, పెదపారుపూడి, ఉంగుటూరు, గన్నవరం తదితర మండలాల్లోని పొలాలు మునిగిపోయాయి. వారం రోజులుగా వరిపైరు పరిస్థితి ఇదే. దుబ్బు దశలో నీటిలో ఉండిపోవడంతో పైరు కుళ్లిపోతోంది. కంకిపాడు మండలంలోని ఏల్చూరు మంతెన, ఉప్పులూరు, తెన్నేరు తదితర గ్రామాల్లో వరిపైరు ఇంకా నీటమునిగే ఉంది.

నాట్లు వేసే అవకాశముందా..?

భారీ వర్షాలు, వరద కారణంగా సాగు దెబ్బతినడంతో రైతులు ఏం చేయలేని స్థితిలో ఉండిపోయారు. పొలాల్లో నీరు తగ్గాక మళ్లీ నాట్లు వేసేందుకు నారు అందుబాటులో లేదు. మళ్లీ నాట్లు వేసినా నవంబరు, డిసెంబరుకు గానీ పంట చేతికి అందదు. అయితే, వరద నీరు తగ్గిన తరువాత నిర్ణయం తీసుకుంటామని రైతులు చెబుతున్నారు.

4,006.79 హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

జిల్లాలోని కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం, మచిలీపట్నం, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, అవనిగడ్డ, మొవ్వ, పామర్రు, నాగాయలంక మండలాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. 4006.79 హెక్టార్లలో ఆయిల్‌పాం, కూరగాయలు, తమలపాకు, పసుపు, కంద, బెండ, నిమ్మ, జామ, బొప్పాయి, మొక్కజొన్న, అరటి తదితర పంటలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. కౌలు సొమ్ముతో పాటు పెట్టిన పెట్టుబడి కూడా వరదలో కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోలుకోవడానికి రెండేళ్ల సమయం పడుతుందంటున్నారు. చల్లపల్లి మండలంలోని వెలివోలు గ్రామంలోని లంక భూముల్లో 55 ఎకరాల్లో చేపట్టిన మల్బరీ సాగు కూడా నాశనమైంది. అలాగే, పట్టు పురుగులను పెంచే షెడ్లు నీటమునగడంతో వాటిని సరిచేసుకునే పనిలో వెలివోలు గ్రామ రైతులు ఉన్నారు.



వెలివోలులో దెబ్బతిన్న పట్టు గూళ్లను చూపిస్తున్న రైతు

వివిధ శాఖలకు రూ.280 కోట్ల నష్టం

భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారులు 24 దెబ్బతినగా, రూ.68.65 కోట్ల నష్టం జరిగింది. పంచాయతీరాజ్‌కు సంబంధించి 193 రహదారులు 308 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. వీటి నష్టం రూ.141 కోట్లు. మత్స్యశాఖకు సంబంధించి 2181.73 హెక్టార్లలో చేపలు, రొయ్యల చెరువులు నీటమునిగాయి. 40 బోట్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖకు రూ.64.16 లక్షల మేర నష్టం వాటిల్లింది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించి రూ.280 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.



కృష్ణానది వరద ముంపుతో కుళ్లిపోయిన కంద తోట

వరద మిగిల్చిన.. కన్నీటి వ్యథ!

ఆదుకోండి..

- గతంలో ఎన్నడూ లేనంతగా వరద
- ఇంకా ముంపులోనే పంట పొలాలు
- చేతికొస్తుందనుకున్న పంట నీటి పాలు
- వేల ఎకరాల్లో పంటలకు తీరని నష్టం

కృష్ణానది వరదకు తీర గ్రామాలు కకావికలమయ్యాయి. వందల కోట్లలో నష్టం వాటిల్లింది. ఇళ్లు నీట మునిగాయి. పంటలు సర్వనాశనమయ్యాయి. ఇప్పట్లో కోలుకోలేనంతగా దెబ్బతినటంతో బాధితులు అల్లాడిపోతున్నారు.

కంచికచర్ల/జి.కొండూరు/మైలవరం సెప్టెంబరు 10 : మండలంలో కృష్ణా తీర గ్రామాల్లో గనిఆత్కూరు ఒకటి. మొత్తం 16 వందలకు పైగా కుటుంబాలు గ్రామంలో నివశిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కృష్ణానది వరద తీరని దుఃఖాన్ని మిగిల్చింది. గ్రామంలో ఎవరిని కదలించినా జరిగిన నష్టాన్ని తలుచుకుంటూ కంటతడి పెడుతున్నారు. గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల మేర వరద పోటెత్తింది. కొద్ది ఇళ్లు తప్ప అన్నీ వరద ముంపునకు గురయ్యాయి. ధాన్యం, ఎరువులు, ఇతర సామగ్రి దెబ్బతిన్నాయి. విద్యార్థుల పుస్తకాలు, విలువైన సర్టిఫికెట్లు నీటిలో నానిపోయాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టగా మొలకలు వస్తున్నాయి. నది మధ్యలో ఆరువందల ఎకరాలకు పైగా లంక భూములున్నాయి. కంద, పసుపు, అరటి, మొక్కజొన్న సాగుచేశారు. రోజుల తరబడి నీటిలో మునిగి ఉండటం వల్ల పంటలు పనికిరాకుండా కుళ్లిపోయాయి. రెండు వందల ఎకరాల్లో కంద ఖర్చు ఎకరానికి సగటున రూ. 2.50 లక్షలతో సాగుచేశారు. లంక భూముల్లోనే జరిగిన నష్టం కోట్లలో ఉంది. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, మొక్కజొన్న ఎక్కువగా సాగు చేశారు. పంటలన్నీ దెబ్బతిన్నాయని, జరిగిన నష్టం అంతా ఇంతా కాదని తెలుగు రైతు నేత మూరకొండ ఏడుకొండలు ఆవేదన వెలిబుచ్చారు. పశువులకు మేత కరువైంది. ఒకవైపు పచ్చి మేత లేదు.. ఎండుగడ్డి కూడా లేదు. ప్రభుత్వ సాయం అందేలా కృషిచేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు.



తడిసిన ధాన్యానికి మొలకలు



వెలగలేరులో అడ్రస్ లేకుండా పోయిన మామిడి చెట్లు

నిండా ముంచిన బుడమేరు, పులివాగు..

బుడమేరు, పులివాగుకు వచ్చిన వరదలు రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. పులివాగు పోటెత్తడంతో తోట రామకృష్ణ అనే రైతుకు చెందిన బొప్పాయి తోట పూర్తిగా నేలమట్టమైంది. అంతర పంటలు నామరూపాలు లేకుండా పోయాయి. టమోటా, బంతి పూలు, మల్లి తోట దెబ్బంది. జి.కొండూరు మండలంలో బుడమేరు, పులివాడు వరదలకు, ఇబ్రహీంపట్నం మండలాల్లో కృష్ణా వరదలకు వరి మొత్తం నామరూపాలు లేకుండా పోయింది. ఇప్పటికీ వరి పొలాలు నీటిలోనే నానుతున్నాయి.

- కవులూరు-శాంతినగర్ రోడ్డుకు మూడు చోట్ల, కవులూరు-వెలగలేరు రోడ్డుకు మూడు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. మరోవైపు రెవెన్యూ అధికారులు దెబ్బతిన్న పంటలకు నష్టం అంచనా వేస్తున్నారు.
- మైలవరం చంద్రబాబు నగర్‌లో నివాసం ఉంటున్న కందుర్తి హైమావతి ఇల్లు బుడమేరు వరదకు నీరు రావడంతో కూలిపోయింది. కాయ కష్టం చేసి చిన్న గూడు నిర్మించుకుంటే వరదకు ముంచేసిందని, ఆదుకోవాలని కన్నీటి పర్యంతమైంది.





దెబ్బతిన్న బొప్పాయి తోట

నిండా మునిగాం..

జెట్టి శ్రీనివాసరావు సామాన్య రైతు.. లంకలో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని కంద, అరటి సాగు చేశాడు. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఎంతో ఆశపడ్డాడు. ఆయన ఆశలు అడియాసలయ్యాయి. ఉప్పెనలా కృష్ణానది వరదకు తోటలు కకావికలమయ్యాయి. నాశనమైన తోటలను చూసి బాధతో కుమిలిపోతున్నాడు. రూ. 50 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. కృష్ణానది వరద మిగిల్చిన కన్నీటి వ్యథ ఇది. తీర గ్రామమైన గనిఆత్కూరు రైతులందరిదీ ఇదే పరిస్థితి. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.





బాధితులందరికీ నిత్యావసర సరుకులు

- ముంపు ప్రాంతాల్లో మంత్రి నారాయణ పర్యటన

విజయవాడ లీగల్ : వరద బాధితులందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. ముంపు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. కుందా వారి కండ్రిక, నున్న-నూజివీడు రోడ్డులో ఇప్పటికీ వరద నీరు కొనసాగుతోంది. ఇళ్ల మధ్యన నీటిని మోటార్ల ద్వారా బయటికి తరలిస్తున్న పనులను మంత్రి పరిశీలించారు. భారీ మోటార్లు ఏర్పాటు చేసి.. రోడ్లకు గండ్లు కొట్టారు. పొక్లెయిన్‌లు, భారీ యంత్రాలతో నీటి తరలింపు పనులను పర్యవేక్షించారు. కండ్రిక చుట్టుపక్కల కొన్నిప్రాంతాల్లో ఇప్పటికీ ఉన్న నీటిని సాయంత్రంలోగా తరిలించేలా ఏర్పాట్లు చేశారన్నారు. వరద నీరు తగ్గగానే పారిశుధ్య పనులు ప్రారంభించారు. ఇప్పటికే వరద నష్టం అంచనాల ప్రక్రియ కూడా జరుగుతోందని, నష్టంపై నివేదిక సిద్ధం కాగానే ఎంత పరిహారం ఇవ్వాలనేది సీఎం నిర్ణయం తీసుకొంటారన్నారు. ఇప్పటి వరకు లక్షా 75 వేల మందికి నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. సాయంత్రానికి పూర్తిగా అందరికీ అందిస్తామన్నారు.

ఎన్యూమరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి : కలెక్టర్ సృజన

కృష్ణలంక : వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టెలీకాన్ఫరెన్సులో అధికారులతో ఆమె మాట్లాడుతూ, నష్ట గణాంకాల నమోదులో కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా యాప్‌లో వివరాలను నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు యాప్‌లో అప్డేట్ చేస్తున్న అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బృందసభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే నోడల్ అధికారులను సంప్రదించి నివృతి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

విపత్తులోను జగన్ విధ్వంసకర రాజకీయాలు

- 90 రోజుల చంద్రబాబు పాలనకు జనం జేజేలు
- వరదలను సమర్థంగా ఎదుర్కొన్నాం : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, సెప్టెంబరు 10 : విపత్తులోను మాజీ సీఎం జగన్ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడటం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీమంత్రి నెట్టెం రఘురాం విమర్శించారు. సీఎం చంద్రబాబు రేయింబవళ్లు వరద ముంపులో ఉన్న ప్రజలను ఎలా గట్టెక్కించాలా, ఎలా ఆదుకోవాలా అని పర్యవేక్షిస్తే, జగన్ బెంగుళూరు ప్యాలెస్‌లో విలాసాలు అనుభవిస్తూ ప్రభుత్వంపై ఎలా బురద చల్లాలా.. ప్రజలను ఎలా ఇబ్బందులు పెట్టాలా.. అని చూశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నెట్టెం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, జగన్ ఆలోచన విధానాన్ని ప్రజలు గమనించి జాగరూకతతో ఉండాలని కోరారు. అధికారం చేపట్టిన 90 రోజుల్లో అవిశ్రాంతంగా జగన్ విధ్వంసక, అరాచక పాలన దుష్ఫలితాలను తొలగిస్తు, గాడి తప్పిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటు, కేంద్రం నుంచి అమరావతి, పోలవరానికి నిధులు తెస్తున్న చంద్రబాబు పాలనను ప్రజలు హర్షిస్తున్నారని చెప్పారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

బాధ్యతాయుతంగా సర్వే నిర్వహించాలి : డీఈవో

చిట్టినగర్, సెప్టెంబరు 10 : బాధ్యతాయుతంగా అధికారులు విధులు నిర్వహించి ముంపు బాధితుల వివరాలను, ఆస్తి నష్టాన్ని నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం చిట్టినగర్‌లో ముంపు నష్టం సర్వేపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి స్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయాలన్నారు. ఇంట్లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ తదితర గృహోపకరణాలు గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, వార్డు సెక్రటరీలు, వీర్వోలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. 46, 47వ డివిజన్‌లలో మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాలలో ఆస్తి నష్టపోయిన బాధితుల వివరాలను నమోదు చేశారు. డివిజన్‌లలో వార్డు సెక్రటరీలు, వలంటీర్ల క్లస్టర్ల ప్రకారం అధికారులు ముంపు ప్రాంతాలకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు.

కొండచరియలు జారిపడి..

- ఒకరి మృతి.. ఇరువురికి గాయాలు

గుణదల, సెప్టెంబరు 10 : చెట్టు కొడుతున్న క్రమంలో కొండచరియ విరిగిపడి ఒకరు చనిపోగా, ఇరువురికి గాయాలైన ఘటన మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురు రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. మోడ్రన్ సూపర్ మార్కెట్ పక్క సందులో కొండ పక్కన నివాసితులు కొండపైన చెట్టును కొట్టేందుకు ముగ్గురు కూలీలను మాట్లాడారు. వారిలో ఇజ్జాడ రాము(55) చెట్టు ఎక్కి చెట్టు కొడుతుండగా వర్షానికి నాని ఉన్న కొండచరియ విరిగి పడింది. ఇజ్జాడ రాము అక్కడికక్కడే చనిపోగా, మరో ఇద్దరు బాసూరి కామయ్య(58), కల్లా రాజు(58)లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, బొప్పన భవకుమార్‌లు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కొండచరియలు పడిన ప్రదేశం.. మృతుడు ఇజ్జాడ రాము

గంటల వ్యవధిలోనే రూ 5లక్షల పరిహారం అందజేత

కొండచరియ జారిపడిన ఘటనలో మృతుడు ఇజ్జాడ రాము కుటుంబానికి ప్రభుత్వ సాయం రూ. 5లక్షల చెక్కును ఎమ్మెల్యే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కొద్ది గంటల వ్యవధిలోనే స్పందించి రూ 5లక్షలు మంజూరు చేసింది.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

వినాయక చవితి ఫ్లెక్సీ వివాదం

జనసేన కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తల దాడి.. సోషల్‌మీడియాలో వైరల్.. కేసు నమోదు

మచిలీపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకల ఫ్లెక్సీలో ఫోటో వివాదం టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య దాడికి కారణమైంది. ఈ విషయం బయటకు రాకుండా కూటమి నేతలు రాజీ చేసినా.. సోషల్ మీడియాలో వైరల్ అవడంతో చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. నగరంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఘటనకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఎస్పీ ఆర్. గంగాధరరావు పోలీసులను ఆదేశించారు. దీంతో చిలకలపూడి స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నంలోని నాయర్ బడ్డీ సెంటరులో గణపతి నవరాత్రుల సందర్భంగా జనసేన కార్యకర్త యర్రంశెట్టి నాని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాడు. ఇందులో టీడీపీ కార్యకర్తల ఫొటోలు వేయలేదు. ఫ్లెక్సీలలో తమ ఫొటోలు వేయకపోవడాన్ని తప్పుబట్టిన టీడీపీ కార్యకర్త సంకు శ్రీను ఈనెల 8వ తేదీన ఫ్లెక్సీలను చించివేశాడు. మరుసటిరోజు యర్రంశెట్టి నాని నాయర్ బడ్డీసెంటరులోని తన బంధువైన శాయనశ్రీను ఇంటిలో ఉండగా అక్కడకు తన అనుచరులు 30 మందితో కలిసి సంకు శ్రీను వెళ్లాడు. యర్రంశెట్టి నాని, అతని బంధువులపై దాడిచేశారు. ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఫ్లెక్సీలలో తమ ఫొటోలు వేయకపోవడం తప్పేనని కాళ్లు పట్టుకుని మరీ చెప్పించారు. ఈ ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. వివాదం బయటకు రాకుండా ఇరువర్గాల మధ్య జనసేన నాయకులు రాజీ చేశారు. అయితే ఘటనకు సంబంధించిన వీడియోలు బయటకురావడం, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎస్పీ సీరియస్ అయ్యారు. యర్రంశెట్టి నాని, అతని బంధువులపై దాడిచేసిన వారిపై కేసునమోదు చేయాలని ఎస్పీ ఆదేశించడంతో చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. దీంతో పార్టీలకు సంబంధం లేదని, ఇరువర్గాల మధ్య ఉన్న విభేదాల కారణంగానే జరిగిందని, వైసీపీ నాయకులు ఘటనపై దుష్ప్రచారం చేస్తున్నారని మచిలీపట్నం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వణికిస్తున్న విషజ్వరాలు!

- పులిగడ్డ గురుకుల పాఠశాలలో 25మంది జ్వర పీడితులు
- అత్యవసర వైద్యశిబిరం ఏర్పాటు



పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది, పాఠశాల తనిఖీలో డీఎంహెచ్‌వో గీతాబాయి

అవనిగడ్డ, సెప్టెంబరు 10 : అవనిగడ్డ మండలం పులిగడ్డలో విషజ్వరాలు వణికిస్తున్నాయి. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో పలువురు విద్యార్థులు జ్వరంతో బాధపడుతుండటంతో వైద్యఆరోగ్య శాఖ అత్యవసర వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నది. పులిగడ్డ ఏపీ గురుకుల పాఠశాలలో సుమారు 460 మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యాభ్యాసం చేస్తున్నారు. వారిలో సోమవారం సాయంత్రం నుంచి పలువురు విద్యార్థులు తీవ్ర జ్వరంతో ఇబ్బంది పడుతుండటాన్ని గమనించిన ప్రిన్సిపాల్ ఎస్‌టిపి.కుమార్ వేకనూరు పీహెచ్‌సీ వైద్యాధికారులకు సమాచారం ఇచ్చి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని కోరడంతో డాక్టర్లు ప్రభాకర్, షేక్ రియాజ్‌లు సిబ్బందితో వచ్చి ఆసుపత్రిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు గురుకుల పాఠశాల ఆవరణం మొత్తం పారిశుధ్య చర్యలు చేపట్టారు. వైరల్ జ్వరాలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు వైరల్ సోకి ఉండవచ్చున్నారు. వైద్య సిబ్బంది వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురికావటంతో వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరదల నేపథ్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులను అవనిగడ్డలోని పునరావాస శిబిరానికి తరలించారు. వీరిలో కొంత మంది తమ స్వగృహాలకు వెళ్లి వచ్చారు. వారిలో అత్యధికులు జ్వరం బారిన పడినట్టు సమాచారం. 40 మంది వరకు జ్వరం బారిన పడిఉంటారని భావిస్తున్న పాఠశాల యాజమాన్యం వారిలో జ్వరం తీవ్రంగా ఉన్న ఐదుగురు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇళ్లకు పంపించివేశారు. వైద్య పరీక్షల్లో 25 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు తెలియవచ్చింది. వారిలో కొందరికి హై ఫీవర్ ఉండటంతో వారికి సెలైన్, మందులు అందిస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణ అధ్వానం

పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ కూడా జ్వరాల వ్యాప్తికి కారణం కావొచ్చని తెలుస్తోంది. వసతి గృహంలోని స్నానశాల వద్ద, మంచినీటి ట్యాపుల వద్ద అపరిశుభ్ర పరిస్థితులు నెలకొని ఉండటంతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పంచాయతీ సిబ్బందితో కలిసి పాఠశాలలో బ్లీచింగ్, దోమల నివారణ మందులను పిచికారి చేయించారు. విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇవి సాధారణ జ్వరాలేనని, ఇటీవల ఇళ్లకు వెళ్లి వచ్చిన వారిలో పది మంది జ్వరాల బారిన పడ్డారని, వారి ద్వారా గురుకుల పాఠశాల విద్యార్థులకు జ్వరాలు వ్యాప్తి జరగకుండా ఉండేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ తెలిపారు.

పాఠశాలను సందర్శించిన డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి

పులిగడ్డ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి గీతాబాయి పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్, వైద్యులు ప్రభాకర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి వరకు జరిగిన పరీక్షల్లో మొత్తం 31 మంది జ్వరపీడితులుగా తేలారని, వారిలో ముగ్గురు తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఉండగా, మరో ఆరుగురు చికిత్స కోసం ఇళ్లకు వెళ్లినట్లు గీతాభాయి తెలిపారు. జ్వరాల తీవ్రత పెరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

డ్రోన్‌తో పాములలంక వంతెన స్థల పరిశీలన

- సీఎం చంద్రబాబు ఆదేశాలతో వచ్చిన అధికారులు



తోట్లవల్లూరు, సెప్టెంబరు 10 : కృష్ణానదిపై తోట్లవల్లూరు నుండి పాములలంకకు బ్రిడ్జి నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మంగళవారం ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ డీఈ నాగరాజు, ఏఈ రాజశేఖర్ డ్రోన్‌తో పాములలంక రేవుకి వచ్చారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ పాముల శ్రీనివాసరావు, పాముల ప్రకాష్, పాముల కోటేశ్వరరావు సదరు అధికారుల వెంట ఉండి గతంలో అధికారులు బ్రిడ్జి కోసం చేసిన చర్యలను వివరించారు. నదీపాయలో వరద ప్రవహిస్తుండటంతో తోట్లవల్లూరు రేవులో నిలబడి పాములలంక ఆంజనేయస్వామి విగ్రహం వరకు డ్రోన్ విజువల్స్ తీశారు. ఈ వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేస్తామని అధికారులు తెలిపారు.

పీసీసీ ఉపాధ్యక్షుడిగా గురునాథం

విజయవాడ లీగల్, సెప్టెంబరు 10 : పీసీసీ ఉపాధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది, బార్ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ లీగల్‌సెల్ చైర్మన్ వి.గురునాథంను నియమిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ, దాదాపు 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్నానని, రాహుల్‌ను ప్రధానిని చేయడమే తన లక్ష్యమని తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బార్ కౌన్సిల్ మెంబర్ సూరాబత్తుల మల్లేశ్వరరావు, బార్ న్యాయవాదులు తదితరులు గురునాథంను ఘనంగా సత్కరించారు.



గురునాథంను సత్కరిస్తున్న న్యాయవాదులు



చంద్రబాబుకు చెక్కు ఇస్తున్న మాలకొండయ్య

వరద బాధితులకు రూ. 6 లక్షలు

జి.కొండూరు : వరద బాధితుల సహాయార్థం ప్రముఖ వ్యాపార వేత్త కొండా మాలకొండయ్య రూ.5 లక్షల చెక్కును, ఈషా రెటీనా ఫౌండేషన్ ఐ ఆసుపత్రి అధినేత కొండ రాజేష్ రూ.1లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, దేవరపు మాల్యాద్రి, కొండా మహేష్, మేడసాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మునేటిలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చర్యలు

ఇంకా లభ్యంకాని చంటి ఆచూకీ..

నందిగామ, సెప్టెంబరు 10 : మునేటి వరదలో గల్లంతైన మాడుగల చంటి ఆచూకీ ఇంకా లభ్యంకాలేదు. సోమవారం మునేటిలో ఈతకు దిగి గల్లంతైన చంటి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. మరబోట్ల సాయంతో మధిర వంతెన వద్ద నుంచి కీసర వంతెన వరకూ నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆర్డీవో రవీంద్రరావు, తహసీల్దార్ సురేష్‌ల పర్యవేక్షణలో గాలింపు జరుగుతోంది. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, బీజేపీ నేత బండారు కేదార్‌నాథ్ తదితరులు అధికారులతో మాట్లాడుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



జగ్గయ్యపేట రూరల్ : బూదవాడ గ్రామానికి చెందిన లావుడియా నాగేశ్వరరావు (53) కాలనీలోని కనదుర్గమ్మ ఆలయంలో ఇటీవల పాలేరు నదికి వచ్చిన వరదతో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురద తొలగిస్తు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ ఏర్పాటు



ఉయ్యూరు, సెప్టెంబరు 10 : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు స్మార్ట్‌మీటర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు సబ్ డివిజన్ డీఏఈ ఎంవీవీ రామకృష్ణ మాట్లాడుతూ, డీఏఈ డి. కృష్ణనాయక్ పర్యవేక్షణలో ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నామన్నారు. సెక్షన్ ఇంజనీర్లు జె.నాగమల్లేశ్వరరావు, బి.దేవదాసు, ఎస్‌వీవీ సత్యనారాయణ, సిబ్బంది, ఆదాని గ్రూపు ఎస్ఈఈ అజార్, జూనియర్ ఇంజనీర్ మేరుగు చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ ఉత్సవాలు

పెనమలూరు, సెప్టెంబరు 10 : పెనమలూరు మండలంలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తాడిగడప, కానూరు, యనమలకుదురు తదితర గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని సమీప చెరువులు, కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. పోరంకి మధురం ఎలైట్ అపార్టుమెంట్‌లో వినాయకచవితి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన వేడుకలను అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన లడ్డూ వేలంలో చాపరాల బలరామకృష్ణ పన్నెండున్నర వేలకు లడ్డూను దక్కించుకొన్నారు. కార్యక్రమంలో అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.



బంగ్లా వద్ద వినాయకుని పందిరిలో జరిగిన పూజలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని పందిళ్లలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈడుపుగల్లు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి పందిరిలో కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా కంకిపాడు బంగ్లా వద్ద తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : జంక్షన్‌లో వాడవాడలా గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాజీ ఎంపీటీసీ సభ్యులు బొకినాల సాంబశివరావు, పోలీస్ సర్కిల్ ఆఫీసు రోడ్డులో టీడీపీ నాయకులు వీరమాచనేని బుజ్జి ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. స్థానిక విజయవాడ రోడ్డులో సాయిరెసిడెన్సీ, ధరణీ రెసిడెన్సీల్లో అపార్ట్‌మెంట్ వాసులు గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నూజివీడు రోడ్డు గంగానమ్మ గుడి ఉత్సవ పందిరి వద్ద నిర్వాహకులు మంగళవారం అన్నదానం నిర్వహించారు.

ముంపు ప్రాంతాల్లో దాణా పంపిణీ



దాణాను అందజేస్తున్న కామధేను ప్రతినిధి ప్రసాద్, టీడీపీ నాయకులు మొవ్వా వేణుగోపాల్, పుట్టా సురేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 10 : బుడమేరు వరద వల్ల ముంపునకు గురైన బాపులపాడు మండల గ్రామాల్లోని పాడిరైతులకు అండగా నిలచేలా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన మేరకు కామధేను ఫీడ్స్ వారు పశువుల దాణాను మంగళవారం పంపిణీ చేశారు. కామధేను ఫీడ్స్ చైర్మన్ బొబ్బా వెంకటేశ్వరరావు 300 బస్తాల దాణాను మంగళవారం అందజేశారు. ముంపు ప్రాంతాలైన రామన్నగూడెం, రంగయ్యప్పారావుపేట, ఆరుగొలను, ఓగిరాల గ్రామాల్లో టీడీపీ నాయకులు పుట్టా సురేష్, మొవ్వా వేణుగోపాల్, చలసాని శ్రీనివాస్ తదితరుల పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో పాడిరైతులకు దాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి వీరాంజనేయులు, శ్రీనివాసరావు, నాని, దాసు తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికులను కొనసాగించాలి



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మిడ్‌డే మీల్స్ ఏజెన్సీ మండల కమిటీ సభ్యులు

ఉంగుటూరు, సెప్టెంబరు 10 : మధ్యాహ్న భోజన వంట కార్మికులను ఎటువంటి రిమార్క్ లేకుండా విధుల నుంచి తప్పించేందుకు కొంత మంది రాజకీయ నాయకులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ కమిటీల వారిపై ఒత్తిడులు తెచ్చి బలవంతపు తీర్మానాలు చేయిస్తున్నారని, ఇది సరికాదని వంట ఏజెన్సీల సంఘం మండల కమిటీ కార్యదర్శి లక్ష్మి అన్నారు. తేలప్రోలు జడ్పీ హైస్కూల్‌లో మిడ్ డే మీల్స్ కార్మికురాలిగా పనిచేస్తున్న సాలి చంటిని వంట విధులనుంచి తప్పుకోవాలంటూ సంబంధిత పాఠశాల హెచ్‌ఎం నోటీసులు జారీచేయడంపై వంట ఏజెన్సీల సంఘం మండల కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో వంట ఏజెన్సీ కార్మికులు స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈవో-2 జె.సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు, వంట ఏజెన్సీల సంఘం మండల కమిటీ సభ్యులు నాగలక్ష్మి, భవానీ, సత్యవతి, పార్వతి, రంగమ్మ, టీవీ లక్ష్మణ స్వామి, అజ్మీర్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ నేతల తీరు సిగ్గుచేటు

● మాజీ ఎంపీపీ దేవినేని రాజా

కంకిపాడు, సెప్టెంబరు 10 : ఎన్నికల్లో ప్రజలు వైసీపీని ఘోరంగా ఓడించి ఇంటికి పంపించినా, వైసీపీ నాయకులు తీరు మారకపోవడం సిగ్గుచేటని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, కృష్ణా బ్యారేజీలోకి ఇనుపబోట్లు పంపి బ్యారేజీకి డ్యామేజీ చేసేందుకు కుట్ర పూరితంగా వ్యవహరించిన వైసీపీ నాయకుల కుట్రలను ఉమ్మడి ప్రభుత్వం బట్టబయలు చేసిందన్నారు. ఇటువంటి వికృత చేష్టలకు పాల్పడిన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జగన్, ఆ పార్టీ నాయకులు ఒక రోజు మాత్రమే పర్యటించటం దురదృష్టకర మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు కూటమి ప్రభుత్వ నాయకులు వరద ప్రాంతాల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల్లో భరోసా నింపుతున్నారన్నారు.

నష్టాన్ని కేంద్ర బృందానికి వివరిస్తాం

● కలెక్టర్ డీకే బాలాజీ

● వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి పరిశీలించిన కలెక్టర్



పెదపులిపాకలో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 10 : వరదల కారణంగా జరిగిన నష్టాన్ని బుధవారం జిల్లాలో పర్యటించే కేంద్ర బృందానికి నివేదిస్తామని కలెక్టర్ బాలాజీ అన్నారు. మంగళవారం కృష్ణానదీ తీర ప్రాంతాలైన యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల కరకట్ట వెంట స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ పర్యటించారు. యనమలకుదురు, పెదపులిపాకకు చెందిన వరద బాధితుల ఇబ్బందులను వారు అడిగి తెలుసుకొన్నారు. కరకట్ట వెంట ప్రజల ఇబ్బందులను బోడె ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, వరద బాధిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎన్ని విధాలుగా ఇబ్బందులు పడిందీ, రైతులకు ఎంత నష్టం వాటిల్లింది తదితర వివరాలను వారికి వివరిస్తామన్నారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని కూలంకషంగా అధికారులతో చర్చించి నివేదిక తయారు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పెదపులిపాక గ్రామ నిరాశ్రయులు తమ ఇబ్బందులను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజు, తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్, సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరి, మునునూరు శ్రీధర్, నిర్మల్, ఆజాద్, శొంఠి శివరాం ప్రసాద్, పాదాల ప్రభాకరరావు, వీరంకి కుటుంబరావు, పండల రజిని అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వరద ముంపు వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలంలో వరద ముంపునకు గురైన రామన్నగూడెం, ఓగిరాల గ్రామాల్లో ఆయన సోమవారం రాత్రి పర్యటించారు. వరద బాధితులతో ముఖాముఖి నిర్వహించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ముంపునకు గురైన పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన 25 కేజీల బియ్యం, నిత్యావసరాలను ఆయన పంపిణీ చేశారు. రంగయ్యప్పారావుపేటలో దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ వితరణ చేసిన దుప్పట్లను వరద బాధితులకు అందజేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో బుడమేరు ఆక్రమణల వల్ల ప్రజలు ఇబ్బందులెదుర్కొన్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టా సురేష్, మూల్పూరి సాయి కళ్యాణి, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, యనమదల సుధాకర్, గండేపూడి నితీష్ కుమార్, చలసాని శ్రీనివాస్, దుట్టా శివన్నారాయణ, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఆశోక్, మండాది రవీంద్ర, తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీవో జోగేశ్వరరావు పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

టీచర్స్ సొసైటీ కార్యవర్గం ఏకగ్రీవం



టీచర్స్ సొసైటీ నూతన అధ్యక్షుడు ఇంటూరి నాగేశ్వరరావుతో కార్యవర్గం

కంకిపాడు, సెప్టెంబరు 10 : ది టీచర్స్ కో- ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో జరిగింది. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు, విజయవాడ రూరల్ మండలాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఈ సొసైటీ పనిచేస్తుందని నూతన అధ్యక్షులు ఇంటూరి నాగేశ్వరరావు తెలియజేశారు. కార్యవర్గ ఉపాధ్యక్షుడిగా పీకా ఇమ్మానుయేలు, కార్యదర్శిగా కె. కేజియ, డైరెక్టర్లుగా బి. మౌలాల్, అబ్దుల్ ఖలీక్, మీర్జా హసనైన్, పి. వెంకటేశ్వరరావు, పి.డి. ప్రసాదరావు, జి. జయరాజు, బి. సునీత, కె.జె మోహన్‌రావులను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నాగేశ్వరరావు తెలిపారు.

ముంపు వీడని ఉయ్యూరు బస్టాండ్

● ఆవరణ వెనుక నీరు నిలిచి దుర్గంధం

● ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు, కార్మికులు



ఉయ్యూరు, సెప్టెంబరు 10 : ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఉయ్యూరు ఆర్టీసీ డిపో గ్యారేజీతో పాటు, బస్టాండ్ ఆవరణలో మోకాలు లోతు నీరు నిలిచి కార్మికులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షపునీరు బయటకు పోయే మార్గంలేక గ్యారేజీ ఆవరణతో పాటు, కార్యాలయ ఆవరణలో నీరు నిలిచింది. బస్సులకు మరమ్మతులు చేసే పిట్లలో కూడా నీరు చేరడంతో మెకానిక్‌లకు ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ప్రజా రవాణా అధికారి వాణి సోమవారం పరిశీలించి, నిలిచిన నీటిని తొలగించాలని ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు ఇంజనుతో నీరుతోడి బయటకు పంపే ఏర్పాట్లు డిపో అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్యారేజీ, బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని ఫోటోలు తీసేందుకు ప్రెస్ వాళ్లు వెళ్లగా వారిని ఎందుకు అనుమతించారని డిపో సెక్యూరిటీ సిబ్బందిపై జిల్లా ప్రజారవాణా అధికారి మండిపడ్డారు.



రంగయ్యప్పారావు పేటలో మునిగిన వరి పొలాలు



ఆముదాలపల్లిలో..



వీరవల్లిలో దెబ్బతిన్న వరి

వరద నీటిలోనే పొలాలు, చెరువులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 10 : బుడమేరు వాగు వరద నీరు బాపులపాడు మండలంలోని పలు గ్రామాలను ముంచెత్తుతుండటంతో గత 10రోజులుగా వరి పొలాలు, ఆక్వా చెరువులు నీట మునిగాయి. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, రామన్నగూడెం, ఓగిరాల, రంగయ్యప్పారావుపేట గ్రామాలు మంగళవారం కూడా వరద నీటిలోనే ఉన్నాయి. ఆరుగొలనుకు 4కిలో మీటర్ల అవతల ఉన్న బుడమేరు వరదనీరు గ్రామంలోకి చేరడంతో పాటు గుడివాడ వెళ్లే ఎంఎన్‌కే రహదారిపై మూడు అడుగుల మేర నిలిచి ఉండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గ్రామాల్లోకి వెళ్లేందుకు ప్రధాన రహదారులు కూడా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఆక్వా చెరువులకు గండ్లు పడి ఎవరిచెరువు ఎక్కడో కూడా తెలియని స్థితిలో వరదనీరు సముద్రాన్ని తలపిస్తూ కనుచూపుమేర నీటితో నిండిపోయాయి.

7,500ఎకరాల్లో వరిపంట నష్టం

ఉంగుటూరు : అధిక వర్షాలకు బుడమేరు, వన్నేరు, పిల్లికోడుకు వచ్చిన వరదల కారణంగా మండలంలోని 23గ్రామాల్లో సుమారు 7,500 ఎకరాల్లో వరిపంట దెబ్బతిందని, తొమ్మిది రోజులుగా వరిదుబ్బులు నీటిముంపులోనే వుండటంతో మొక్కలు కుళ్లిపోయి రైతులకు తీవ్రనష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి వీవీఎస్ఆర్ఎస్ హరీష్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం గారపాడు, ఇందుపల్లి, లంకపల్లి, ఉంగుటూరు, ఎలుకపాడు పొలాలను పరిశీలించారు. చికినాల, బొకినాల, మదిరపాడుల్లో సుమారు 45 ఎకరాల్లో బొప్పాయి పంట నీటమునిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : మండల పరిధి పలు గ్రామాల పొలాల్లో వరిపైరు నీటమునిగి ఉంది. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు తోడు ఎగువనుంచి వచ్చిన నీటితో పొలాలు ముంపునకు గురై వరిపైరుకు నష్టం వాటిల్లింది. వీరవల్లి, పొట్లపాడు, గండిగుంట గ్రామాల పరిధిలో పొలాల్లో నీరు ఇప్పటివరకు తగ్గకపోవడంతో వరి పైరు కుళ్లిపోతుంది. మండల పరిధిలో 521 ఎకరాల్లో వరిపంట ముంపునకు గురైనట్టు ఏవో నీస్సీగ్రేస్ తెలిపారు.

బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

ఉప్పులూరు (కంకిపాడు), సెప్టెంబరు 10 : వరద ప్రభావిత ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం అందించిన సేవలు మరువలేనివని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. మండలంలోని ఉప్పులూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉండటంతో రాష్ట్రం వరదల నుంచి త్వరగా కోలుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు చలసాని రాధాకృష్ణమూర్తి, పడవల మధుసూదనరావు, కొండవీటి శివయ్య, అన్నే మురళి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : వరద బాధితులకు తామున్నామంటూ ట్రైబ్ కాన్సెప్ట్ సంస్థ, సీపీఎం మంగళవారం కృష్ణా కరకట్ట వెంబడి యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల్లో ఆహార ఏర్పాట్లు చేశారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, విజయవాడ ఆర్థిక సాయంతో కరకట్ట వెంబడి ఉన్న వరద బాధితులకు ఆహారాన్ని సరఫరా చేశారు. ట్రైబ్ కాన్సెప్ట్ ఆధ్వర్యంలో యనమలకుదురులో బ్రెడ్, బిస్కెట్‌లు, వాటర్ బాటిళ్లను అందజేశారు.



వరద బాధితులకు ఏర్పాటు చేసిన భోజనాలను వడ్డిస్తున్న టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య



యనమలకుదురులో ఆహార ప్యాకెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తదితరులు

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు దాతలు ముందుకు వచ్చి ఆపన్న హస్తం అంది స్తున్నారు. గత మూడు రోజులుగా ఆర్యవైశ్య సంఘం భోజనం ఏర్పాట్లు చేయగా మంగళవారం ఆరుగొలనుకు చెందిన పారిశ్రామిక వేత్త కొల్లి వెంకట ధనుంజయ బాధితులకు అన్నదానం చేశారు. పీడీ పామర్తి వెంక టేశ్వరరావు కుటుంబ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండలంలోని ముంపు ప్రాంతాల్లో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాలు మంగళవారం కూడా కొనసాగాయి. దాతల సహకారంతో రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో పునరావాస కేంద్రాల్లోని సుమారు 1200 మందికిపైగా వరద బాధితులకు అల్పాహారం, భోజన సదుపాయాలను నిరాటంకంగా ఏర్పాటు చేస్తున్నారు. కానుమోలు హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో గల బాధితులకు దంటగుంట్ల గ్రామస్థుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉంగుటూరు : వరద ప్రభావంతో ముంపునకు గురైన గ్రామాల్లో నిర్వాసితులకు పొట్టిపాడు బెస్ట్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి జోయెల్, నందమూరు అనగాని ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అనగాని సురేష్, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు ముందుకొచ్చి ఆహారపదార్థాలు, నిత్యావసర సరుకులు అందించారు. ఆత్కూరు, పెదఅవుటపల్లి, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ఎలుకపాడు, వేంపాడుల్లో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాల్లో ముంపుబాధితులకు స్థానిక కూటమి నాయకులు, అధికారులు భోజన ఏర్పాట్లు చేశారు.



బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో..



ఆముదాలపల్లిలో నిత్యావసరాలు పంపిణీ



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పాలడుగు పార్వతీదేవి

సీఎం సహాయనిధికి రూ.3 లక్షల విరాళం

గన్నవరం, సెప్టెంబరు 10 : మండలంలోని సూరంపల్లి పాలడుగు పార్వతీదేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ చైర్ పర్సన్ పాలడుగు పార్వతీదేవి వరద బాధితుల సహాయార్థం మంగళవారం సీఎం చంద్రబాబుకు రూ.3లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పార్వతీదేవి మాట్లాడుతూ, పది రోజులుగా వరదలతో విజయవాడ నగరం అతలాకుతలం అయ్యిందన్నారు. ఆ ప్రాంత వాసులను సహృదయంతో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజేంద్ర పాల్గొన్నారు.

పెనమలూరు : తాడిగడప మునిసిపాలిటీ పోరంకికి చెందిన దొండపాటి లక్ష్మయ్య కుటుంబం విజయవాడ వరద బాధితుల సహాయార్థం మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఏభైవేల విలువైన చెక్కును అందించారు. లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బోడె అభినందించారు.

విజయవాడ పాలఫ్యాక్టరీ పునరుద్ధరణకు..

● వీరవల్లి, చిట్యాల పాలసొసైటీల విరాళం



చైర్మన్ చలసాని ఆంజనేయులుకు విరాళాల చెక్కును అందజేస్తున్న వీరవల్లి, చిట్యాల పాలసొసైటీ అధ్యక్షులు నిరంజన్‌రావు, సుశీల

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : దశాబ్దాలుగా విపత్కర పరిస్థితుల్లో కూడా ఆగకుండా సేవలందించిన విజయవాడలోని కృష్ణామిల్క్ యూనియన్ పాల ఫ్యాక్టరీ ఇటీవల వరదల్లో ముంపునకు గురవడం విచారకరమని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. విజయవాడలోని పాలఫ్యాక్టరీ పునరుద్ధరణకు వీరవల్లి పాలసొసైటీ తరఫున రూ. 50వేలు, చిట్యాల పాల సొసైటీ తరఫున రూ.50వేల విరాళాన్ని వీరవల్లిలోని ప్రాజెక్ట్ కామధేను(కృష్ణామిల్క్ యూనియన్ పాల ఫ్యాక్టరీ) ఆవరణలో చైర్మన్ చలసాని ఆంజనేయులుకు వీరవల్లి పాలసొసైటీ అధ్యక్షుడు నిరంజన్‌రావు, చిట్యాల పాల సొసైటీ అధ్యక్షురాలు బి. సుశీల మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఈశ్వరబాబు, క్లస్టర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.25

మన కోసం మనం ట్రస్ట్‌కు డాక్టర్ వరుణ్ రూ.2 లక్షల విరాళం



చల్లపల్లి : స్వచ్ఛ చల్లపల్లి కోసం అభివృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్ట్‌కు డాక్టర్ డీఆర్కే తనయుడు, నాగార్జున హాస్పటల్ డాక్టర్ వరుణ్ రూ.2 లక్షల విరాళం అందించారు. భార్య దివ్య, పిల్లలతో కలిసి స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ట్రస్ట్ సభ్యులు నల్లూరి రామారావుకు విరాళం చెక్కును అందించారు. స్వచ్ఛ కార్యకర్తల తరఫున వారికి కృతజ్ఞతలు తెలిపారు.



జనార్దనపురం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ బాలాజీ

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

నందివాడ, సెప్టెంబరు 10 : మండలంలోని వరద ముంపు ప్రాంతాలైన జనార్దనపురం, తుమ్మలపల్లి, బుడమేరు పరిసర ప్రాంతాలను మంగళవారం కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్డీవో పద్మావతి, డీటీ మల్లికలతో కలిసి మంగళవారం పర్యటించారు. బుడమేరు పూర్తిగా ఆక్రమణకు గురికావటంతో పరిసర ప్రాంతాల గ్రామాలు మునకకు గురయ్యాయని, ఆక్రమణలు తొలగిస్తేనే ఈ పరిస్థితులు పునరావృతం కాకుండా ఉంటాయని టీడీపీ మలిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయనకు వివరించారు. ఎంపీడీవో నాగేశ్వరరావు, ఆర్ఐ గణేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రామన్నపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

రైతులను పూర్తిగా ఆదుకుంటాం : వెనిగండ్ల

గుడివాడ రూరల్ : పంట నష్టపోయిన రైతులకు, తుఫాను బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. తట్టివర్రు, రామన్నపూడి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలను, నీటమునిగిన గృహాలను ఆయన పరిశీలించి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తాగునీరు, పారిశుధ్యం విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట నష్టం అంచనాలు కచ్చితత్వం ఉండాలని ఏవో బి.అనంతలక్ష్మిని కోరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రైతుకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందేవిధంగా కృషి చేస్తామన్నారు వాసే మురళీ, గోపాలకృష్ణ, సూరపనేని రామకృష్ణ, కైలా కాళిదాసు, తహసీల్దార్ బి.కోటేశ్వరరావు, ఎంపీడీవో ఏ.వెంకటరమణ, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి కృత్తివెన్ను పంచాయతీల విరాళం



కృత్తివెన్ను : వరద బాధితుల సహాయార్థం మండలంలోని పంచాయతీల నుంచి సేకరించిన రూ.3,64,720, బియ్యం కట్టలను ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నారా చంద్రబాబుకు పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఒడుగు తులసిరావు, కూనసాని చిన్నా, యాదంరెడ్డి కొండ, అధికారి అప్పి, చేకూరి వెంకట్రావు, న డకుదిటి ఆంజనేయులు, ఏసుబాబు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

కరెడ్ల సుశీల రూ.లక్ష విరాళం



మచిలీపట్నం టౌన్ : వరద బాధితుల సహాయార్థం తెలుగు మహిళ కరెడ్ల సుశీల రూ. లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు మంగళవారం అందజేశారు. మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదమద్దాలి వాసులు రూ.50 వేల విరాళం

పామర్రు : వరద బాధితులకు ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. వరద బాధితుల సహాయ నిధికి పెదమద్దాలి గ్రామానికి చెందిన విశ్రాంత ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి వీరమాచినేని వేంకటేశ్వరరావు, కొల్లిపర ప్రభాకరరావు, ఎన్.బసవ రామకృష్ణ ఎం.శివప్రసాద్‌తదితరులు రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే కుమార్ రాజాకు అందజేశారు. వరద బాధితులను ప్రభుత్వంతోపాటు దాతలు ముందుకువచ్చి సహాయ సహకారాలందించడం అభినందనీయమన్నారు.

కాజలో ఆరు పూరిపాకలు దగ్ధం

కూచిపూడి : కాజ గ్రామంలోని గండిరేవు చెరువు గట్టున నివాసముంటున్న పారిశుధ్య కార్మికులకు చెందిన ఆరు పూరిపాకలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్యాస్ పొయ్యి నుంచి మంటలు ఎగిసి గృహాలు దగ్ధం కాగా, ఇంట్లోని గృహోపకరణాలు, సామాగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయి. రెండు లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. మచిలీపట్నం అగ్నిమాపక అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. మొవ్వ తహసీల్దార్ మస్తాన రావు, బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, బియ్యం అందజేశారు.

ఫణికృష్ణ భౌతికయానికి అంత్యక్రియలు పూర్తి

పెడన : గన్నవరం మండలం కేసరపల్లి వద్ద బుడమేరు వరదలో గల్లంతై మృతి చెందిన కలిదిండి ఫణికృష్ణ (40) భౌతికకాయాన్ని పోస్టుమార్టం అనంతరం మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో స్వగ్రామం హుస్సేన్‌పాలెం తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. అతని మృతదేహానికి హుస్సేన్‌పాలెంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఫణికృష్ణ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోల్డుగోల్డు కార్మికుడు ఆత్మహత్య

మచిలీపట్నం టౌన్ : కుటుంబ కలహాల వల్ల రోల్డుగోల్డు కార్మికుడు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సర్కారుతోటకు చెందిన వీరం కోదండరామ్‌కుమార్ (39) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిలకలపూడి సీఐ నబీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకు వైసీపీ కుట్ర

గొర్రెపాటి గోపీచంద్ ధ్వజం

మచిలీపట్నం టౌన్ : ప్రజలు భారీ మెజార్టీతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు వైసీపీ నాయకులు ప్రకాశం బ్యారేజీని ఇసుక బోట్లతో ధ్వంసం చేయడానికి కుట్ర పన్నారని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ఆరోపించారు. ఈ కుట్రలో వెనుక ఉన్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కుట్ర వెనుక జగన్మోహనరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి , నందిగం సురేష్, తలశిల రఘురాం ఉన్నారని ఆరోపించారు. పాత్రధారులతో పాటు సూత్రధారులను కూడా అరెస్టు చేయాలన్నారు. టీడీపీ నాయకులు పివిఫణికుమార్, రూపశెట్టి రాంబాబు, ఎం వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రానికి చెంచుకాలనీ ప్రజలు

గుడ్లవల్లేరు : కౌతవరం ఒకటో వార్డు చెం చుకాలనీ ప్రజలను కౌతవరం మెయిన్ ప్రాథమిక పాఠశాల పునరావాస కేంద్రానికి తరలించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ కనకదుర్గ పునరావాస కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. బొబ్బా నరసింహారావు భోజనం ఏర్పాటు చేశారు. నందివాడ మండలంలో 900 మంది వరద బాధితులకు కౌతవరం కూటమి నాయకులు, ప్రజలు భోజనం ఏర్పాటు చేశారు.



బొబ్బర్లంక వద్ద నీటి ముంపునకు పూర్తిగా దెబ్బతిన్న పసుపు తోట



మట్టికొట్టుకుపోయిన పట్టుగూళ్లు



గుడివాడ మండలంలో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి

వాణిజ్య పంటలకు అపార నష్టం

మోపిదేవి : కృష్ణానది వరదల కారణంగా మోపిదేవి మండలంలోని వాణిజ్య పంటలకు అపార నష్టం వాటిల్లింది. బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, మోపిదేవి వార్పు, ఉత్తర చిరువోలు లంక వరదల కారణంగా పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాల్లో కూరగాయలు, అరటి, పసుపు, బొప్పాయి, కొబ్బరి, మామిడి, పూల తోటలు 500 ఎకరాలకుపైగా పూర్తిగా దెబ్బతిన్నాయి. 1100 మందికిపైగా రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు వరద నీటి ముంపుకు గురై పూర్తిగా దెబ్బతిన్నాయి. మోపిదేవివార్పు వద్ద కాలువకు గండి పడి కాలనీలోకి వరద నీరు చొచ్చుకు వచ్చి పంట పొలాలను పూర్తిగా దెబ్బతీశాయి. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పసుపు, బొప్పాయి తోటల్లో నీరునిలిచి ఉన్నాయి.

బీమాతో రైతులను ఆదుకోవాలి



వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వర్తింపచేయాలి. తక్షణమే వడ్డీ లేని రుణాలు అందించి రెండో పంట సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి. ప్రతి రైతుకు పరిహారం అందించాలి. కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేయకపోయినా పరిహారం అందించాలి.

-గద్దె శ్రీహరి, మోపిదేవి

పట్టుగూడు చెదిరింది!

చల్లపల్లి : వెలివోలు గ్రామానికి చెందిన సుమారు 50 మంది దళితులు లంకలో పట్టుపురుగుల పెంపకంపై ఆధారపడి జీవిస్తుంటారు. కృష్ణానదికి 11.42 లక్షల క్యూసెక్కుల వరదనీరు రావటంతో పట్టు పురుగుల షెడ్లు, మల్బరీ తోటలు పూర్తిగా నీటమునిగి దెబ్బతిన్నాయి. రైతులకు నోటికందివచ్చిన పట్టు నీటిపాలైంది. ఒక్కో రైతు సుమారు రూ.40 వేలకు పైగానే ఆదాయాన్ని కోల్పోగా, రూ.20 వేల వరకు పెట్టిన పెట్టుబడిని నష్టపోయారు. 50మంది రైతులు మల్బరీ తోటలు దెబ్బతినటంతో నష్టపోయారు. సాంకేతిక కారణాలతో మల్బరీసాగును ఈ క్రాప్ నమోదు చేసేందుకు అవకాశం లేకపోయింది. పరిహారం వస్తుందో లేదోననే ఆందోళనలో రైతులున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలనీ కోరుతున్నారు.

మల్బరీ రైతులందరికీ పరిహారం ఇవ్వాలి



రెండు రోజుల్లో పట్టు గూళ్లు వలిచి మార్కెట్‌కు తీసుకువెళ్లేవాళ్లం. నోటి కందివచ్చిన పట్టుగూళ్లు నీటిపాలయ్యాయి. మల్బరీ సాగుచేసిన రైతులందరికీ పరిహారం అందించాలి.

-పెనుమత్స ప్రభాకరరావు

పెట్టుబడి, ఆదాయం రెండూ కోల్పోయాం



వరదలతో విక్రయానికి సిద్ధమైన పట్టు గూళ్లను కోల్పోయాం. మల్బరీ తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడితోపాటు వచ్చే ఆదాయాన్నీ కోల్పోయాం. -కుంపటి కృష్ణారావు

మొవ్వ మండలంలో 5700 ఎకరాల్లో పంట నష్టం

కూచిపూడి : పంట నష్టం అంచనాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు రూపొందించారు. మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో 21 గ్రామపంచాయతీల్లో 5710 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు సర్వేలో తేలింది. భట్లపెనుమర్రులో 120 ఎకరాలు, పెదసనగల్లులో 90 ఎకరాలు, అయ్యంకిలో 600, చినముత్తేవిలో 700, అవిరిపూడిలో 270, నిడుమోలులో 840, పాలంకిపాడులో 150, పెదముత్తేవిలో 870, యద్దనపూడిలో ఐదు, పెదపూడిలో ఐదు, కూచిపూడిలో ఐదు, బార్లపూడిలో ఐదు, గూడపాడులో 40, మొవ్వలో 350, వేములపల్లి 80, కోసూరులో 830, కాజలో 750 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనాలు రూపొందించారు. పంట నష్టం వివరాలను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచి నాలుగు రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను ఈ నెల 17న రూపొందిస్తామని ఏవో కె.శివప్రసాద్ తెలిపారు.

ముంపులోనే పొలాలు

మచిలీపట్నం టౌన్ : బందరు మండలంలో వరి, వేరుశెనగ పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఎస్.ఎన్. గొల్లపాలెం, సుల్తానగరం, సీతారామపురం, చినయాదర ప్రాంతాల్లో వరి పొలాలు ముంపులోనే ఉన్నాయి. ముంపునకు గురైన వరి పొలాలను సమగ్ర సర్వే చేయించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో పెదపట్నం, మేకావారిపాలెం, మంగినపూడి ప్రాంతాల్లో వేరుశెనగ పంట పూర్తిగా దెబ్బతింది.

రైతులను ఆదుకోవాలి : గోపు

వ్యవసాయశాఖాధికారులు పంట నష్టం అంచనా సరిగా వేసి రైతులకు న్యాయం చేయాలని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణరావు కోరారు. కానూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బందరు, పెడన, గన్నవరం మండలాల్లో 456 హెక్టార్లలో వేరుశనగ పంటకు నష్టం సంభవించిందన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

గుడివాడ రూరల్ : వరద ముంపు నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ సీనియర్ శాస్త్రవేత్త డి.సుధారాణి అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వివిధ గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలు పరిశీలించారు. నీరు తగ్గిన వెంటనే యూరియా, పొటాష్ సమపాళ్లలో కలిపి చల్లుకోవాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు పొందాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మంజువాణి, మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి, విపిఏలు, రైతులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



పూషడంలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న మండలి



శీతనపల్లిలో పంటపొలాలను పరిశీలిస్తున్న వేదవ్యాస్

ఘంటసాల : ముంపు ప్రభావిత గ్రామాల్లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డ్రైనేజీ శాఖ అధికారులకు సూచించారు. ఘంటసాల మండలంలో లంకపల్లి, పూషడం, యండకుదురు గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాలకు ముంపు బారిన పడిన పంట పొలాలను, ఉధృతంగా ప్రవహిస్తున్న ఐనంపూడి డ్రైన్‌ను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఏవో కె.మురళీకృష్ణ, టీడీపీ నాయకులు తుమ్మల చౌదరి బాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, పరిశె చలపతి, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మిక్కిలినేని మధు, సర్పంచ్‌లు ముళ్లపూడి పట్టాభి రామారావు, అంకం మారుతిరావు, ఎంపీటీసీ సభ్యులు సిద్ధినేని కుమార్ రాజా పాల్గొన్నారు. **మోపిదేవి :** ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా శాశ్వతంగా ముంపు నివారణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. పెదకళ్లేపల్లిలో ముంపునకు గురైన పొలాలను రైతులతో కలసి ఆయన పరిశీలించారు. వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, గోళ్ల శ్రీనివాసరావు, బాదర్ల లోలాక్షుడు ఆయన వెంట ఉన్నారు. **చల్లపల్లి :** గొర్రుకోడు డ్రైనేజీ పనులు వేగ వంతం చేయాలని డ్రైనేజీ శాఖ అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. మంగళాపురం గ్రామంలోని గొర్రుకోడు డ్రైనేజీని ఆయన మంగళవారం పరిశీలించారు. ముంపునకు గురైన పంటపొలాలను చూశారు. . గొర్రుకోడు, పెద్దకోడు, పిల్లంకోడు బాగుచేయాలని రైతులు కోరారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పిట్టు వెంకటేశ్వరమ్మ, మాజీ డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, చంద్ర వెంకటేశ్వరరావు, పరుచూరి కమలాకరరావు, నల్లమోతు వీరయ్య, కొర్రపాటి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను మండలంలో వేదవ్యాస్ పర్యటన

కృత్తివెన్ను : భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. మండలంలోని శీతనపల్లి, యండపల్లి తదితర గ్రామాలలో ఆయన పర్యటించి ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. మాజీ ఎంపీపీ వట్టికూటి విశ్వేశ్వరరావు , పుప్పాల నరసింహారావు, కూనసాని శ్రీనివాస్, ఏసుబాబు, కొప్పర్తి బాబి, అశోక్, అర్థంపూడి సరస్వతీరావు, ఎడుంబాకుల ఫణి, ఇల్లూరి నాగబాబు, బాబ్జి, టి.వాసు, శివ రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో రక్షిత నీటి పథకానికి శంకుస్థాపన



పామర్రు : కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.3.50 లక్షల నిర్మించే రక్షత నీటి పథకానికి ఎమ్మెల్యే కుమార్ రాజా మంగళవారం ఎంపీపీ దాసరిఅశోక్‌కుమార్‌తో కలిసి భూమిపూజ చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు కూనపరెడ్డి స్వరూపరాణి, ఎంపీడీవో రామకృష్ణ, హెచ్‌ఎం ఇం దిర, ఎంఈవో పద్మావాణి పాల్గొన్నారు.

ట్యాక్సీ ఓనర్స్ అన్నదానం

చల్లపల్లి : ప్రధాన సెంటరులోని విఘ్నేశ్వర స్వామి దేవాలయం వద్ద మంగళవారం అన్నసమారాధన జరిగింది. వెంకట్రామ్ అన్నదానాన్ని ప్రారంభించారు. ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, మోర్ల రాంబాబు, ముమ్మనేని నాని, యార్లగడ్డ శ్రీనివాసరావు, వెంకట నరసయ్య, కన్నయ్య, గుడివాక శివరావు పాల్గొన్నారు. అతిథులను ట్యాక్సీ ఓనర్స్, డ్రైవర్ల అసోసియేషన్ పెద్దలు సన్మానించారు.

నిబద్ధతతో పనిచేయాలి

గుడివాడ రూరల్ : సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని ఎంపీడీవో అనగాని వెంకటరమణ అన్నారు. మంగళవారం రామన్నపూడి సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈవోపిఆర్‌డి డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాదుకలకు జనసేన పూజలు

కోడూరు : హంసలదీవి సాగరసంగమ ప్రదేశంలో కృష్ణవేణి పాదుకల వద్ద మండల జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మర్రే గంగయ్య, కొండవీటి సునీత, కరుణ కుమార్, కాగిత రామారావు, సీతారత్న సాయిబాబు, నేతలు పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనాలు

గుడివాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి సభ్యుల సహకారంతో మంగళవారం నందివాడ మండలం బుడమేరు ముంపు బాధితులు 1000 మందికి భోజనాలు అందజేశారు. భోజనాల వాహనాన్ని టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు, దింట్యాల రాంబాబులు జెండా ఊపి ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షులు శేషగిరిరావు, డాక్టర్ భవాని శంకర్, అన్నే నవీన్, లయన్స్ క్లబ్ సభ్యులు సనకా సుబ్బారావు, రామదేను వేణుబాబు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

అవనిగడ్డ రూరల్: దక్షిణ చిరువోలులంకలోని 250 మంది వరద బాధితులకు ప్యూర్ పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ స్థాపకులు పైలా తాళ్లూరి, అర్చన పూరిణి ఆధ్వర్యంలో రూ.4 లక్షల విలువైన దుప్పట్లు, చీరలు, ఐదు కిలోల బియ్యం, తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. శాంతిశ్రీ, స్నేహలత, సారిక, అంకరాజు, సిద్దు, నిక్సన్, సుమన్, కొల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ

చల్లపల్లి : చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు మూల్పూరి ఉపేంద్ర సహకారంతో గొడుగులను పంపిణీ చేశారు.రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి ప్రసాద్, ముమ్మనేని నాని, నర్రా సాయిబాబు, ఏఎల్ఆర్‌కె.ప్రసాద్, మోపిదేవి వెంకటేశ్వరరావు, టి.సాంబశివరావు, కంఠంనేని సుధాకర్, ఎం.వి. కృష్ణారావు, ప్రెస్ పూర్ణలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్

మచిలీపట్నం : చిలకలపూడి మునిసిపల్ హైస్కూలులో ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించారు. 16వ ఆంధ్రా బెటాలియన్ హవల్దార్ రాజ్‌సింగ్ , నాయక్ అమీర్ శర్మ 30 మంది విద్యార్థులను ఎంపిక చేశారు.

ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఎన్‌సీసీ ఆఫీసర్ అప్పినేడి వెంకట రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ కుమార్, శివ పాల్గొన్నారు.

వెలమ సంఘం కూరగాయల వితరణ

గుడివాడ : వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వరద ముంపు బాధితులకు కూరగాయలను వితరణగా అందజేశారు. పెదపారుపూడి మండలం మోపర్రుకు హైదరాబాద్, గుడివాడ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పది రకాల కూరగాయలను పంపారు. సంఘ సభ్యులు సత్యనారాయణ, ఆనంద్, ప్రభాకరరావు, శ్రీనివాసరావు, రమేష్, రంగారావు, మధుసూధనరావు, రెడ్డి షణ్ముఖ్, బ్రహ్మాజీ, బాబు, శ్రీధర్, మోహన్, కళ్యాణ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకుంటున్న విక్కుర్తి

అవనిగడ్డ రూరల్ : పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ పులిగడ్డ పల్లెపాలెంలో మేత లేకుండా అల్లాడుతున్న పశువులకు వరిగడ్డిని అందజేశారు. విక్కుర్తి రాఘవ ట్రస్ట్ నిర్వాహకులు విక్కుర్తి రాంబాబు, హాజీ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరపాలి

మచిలీపట్నం టౌన్ : మంగినపూడి బీచ్‌లోగణేష్ నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించాలని బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలోపే నిమజ్జనం చేయాలన్నారు. సీఐలు షేక్ నబి, పరమేశ్వర్, కె. ఏసుబాబు, ఎస్ఐలు ప్రభాకర్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు. **అవనిగడ్డ/చల్లపల్లి :** వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

సర్పంచ్ కృష్ణకుమారికి సన్మానం

చల్లపల్లి : కేంద్ర పురస్కారం పొందిన చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారికి విజయా అకాడమీలో ఘన సన్మానం జరిగింది. ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కోటేశ్వరి, హెచ్‌ఎం డి.జవహర్, విద్యార్థినులు సర్పంచ్‌ను దుశ్శాలువాతో సత్కరించారు.